


Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 165 | మంగళవారం 02 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# సభలో డ్రామాలు వద్దు...

- పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముందు విపక్షాలకు ప్రధాని మోదీ హితవు
- పార్లమెంటులో డ్రామాలు కాకుండా విధానాలపై చర్చ జరగాలన్న ప్రధాని
- విపక్షాలు ఓటమి బాధ నుంచి బయటపడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- కొత్తగా ఎన్నికైన, యువ ఎంపీలకు మాట్లాడే అవకాశం కల్పించాలని వ్యాఖ్యలు
- భారత్ ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక ప్రగతిని ప్రపంచం గమనిస్తోందని వెల్లడి

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, డిసెంబర్ 01**



పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సభలో డ్రామాలు వద్దని, దేశానికి అవసరమైన 'డెలివరీ' (ఫలితాలు) పైనే దృష్టి పెట్టాలని సోమవారం స్పష్టం చేశారు. నినాదాలు చేయడానికి బయట చాలా వేదికలు ఉన్నాయని, పార్లమెంటును మాత్రం విధాన రూపకల్పనకు పరిమితం చేయాలని ఆయన గట్టిగా సూచించారు. సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా ఎదుట మాట్లాడిన ప్రధాని, ఫలవంతమైన చర్చలు జరగాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఈ శీతాకాల సమావేశాలు కేవలం ఒక సంప్రదాయం

- మిగతా 2లో..

## ప్రజా సమస్యలపై చర్చ లేనప్పుడు
# పార్లమెంటు ఎందుకు.?

- మోదీ వ్యాఖ్యలపై వ్యాఖ్యానించేందుకు రాహుల్ గాంధీ నిరాకరణ, స్పందించిన ప్రియాంక
- పార్లమెంటులో డ్రామాలు వద్దన్న ప్రధాని నరేంద్ర మోదీ
- చర్చలకు అనుమతించక పోవడమే డ్రామా అని కౌంటర్

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, డిసెంబర్ 01**



పార్లమెంటులో డ్రామాలొద్దన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలపై స్పందించేందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించగా, ఆయన సోదరి, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ప్రత్యేక సమగ్ర చట్ట సవరణ (ఎస్ఐఆర్), ఢిల్లీ కాలుష్యం వంటి తీవ్రమైన అంశాలను లేవనెత్తడం డ్రామా ఎలా అవుతుందని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. ఇవి ప్రజాప్రయోజన అంశాలని ఆమె అన్నారు.

- మిగతా 2లో..

## నాణ్యతా ప్రమాణాలు
# పాటించండి

- నిర్దేశిత సమయంలో పనులు పూర్తికావాలి
- మేడారం అభివృద్ధి పనులపై సమీక్షలో సీఎంరేవంత్ రెడ్డి



**హైదరాబాద్ -సూర్య వాస్తవం, డిసెంబర్ 01**

మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు, ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో

- మిగతా 2లో..

## ప్రజా సంక్షేమంలో
# ఏపీనే నంబర్ వన్...

- మరెవరూ ఇంత ఖర్చు చేయడంలేదు: సీఎం చంద్రబాబు
- ఏలూరు జిల్లాలో 'పేదల సేవ' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- గత 18 నెలల్లో పింఛన్ల పంపిణీకే రూ.50,763 కోట్లు ఖర్చు
- కిడ్నీ వ్యాధిగ్రస్తురాలి ఇంటికి వెళ్లి పింఛన్ అందించిన ముఖ్యమంత్రి
- సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టీకరణ



**అమరావతి-సూర్య వ్యాస్తవం, డిసెంబర్ 01**

ప్రజా సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత 18 నెలల్లో కేవలం సామాజిక భద్రతా పింఛన్ల కోసమే రూ.50,000 కోట్లకు పైగా ఖర్చు చేయడమే ఇందుకు

- మిగతా 2లో..



## నెలకు రెండుసార్లు
# విచారిస్తాం

- విద్యార్థుల కోసం కోర్సులు
- ఢిల్లీ వాయుకాలుష్యం కేసుపై సుప్రీంకోర్టు

2వ

## అలక వీడి ప్రజల
# మనసులు గెలవండి

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించాలి
- మండల పార్టీ అధ్యక్షులతో నారా లోకేష్ దిశానిర్దేశం
- టిడిపి కార్యాలయంలో శిక్షణ తరగతులు ప్రారంభం



**అమరావతి -సూర్య వాస్తవం, డిసెంబర్ 01**

పార్టీ నేతలు అలక వీడాలని, సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకురావాలని టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆ పార్టీ నేతలతో అన్నారు. టిడిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమ య్యాయి. ఇందులో భాగంగా 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో లోకేష్ పాల్గని ప్రసంగించారు.పార్టీ కుటుంబం వంటిదని, చిన్న, చిన్న సమస్యలు సహజమన్నారు.క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్‌లు, కుటుంబ సాధికార సారథులతో కలిసి కూర్చొని సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని చెప్పారు.

- మిగతా 2లో..




## నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న
# తీవ్ర వాయుగుండం...

- ఏపీఎస్డీఎంఏ తాజా అలర్ట్
- మధ్యాహ్నానికి వాయుగుండంగా బలహీనపడే అవకాశం
- నెల్లూరు, తిరుపతి జిల్లాలకు భారీ నుంచి అతిభారీ వర్షాల హెచ్చరిక
- దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- రేపటి వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని సూచన

**అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 01**

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను గత రాత్రి బలహీనపడడం తెలిసిందే.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ముగిసిన పరకామణి
# కేసు విచారణ

- నేడు హైకోర్టుకు 156 పేజీలతో సిట్ నివేదిక

**తిరుమల -సూర్య వాస్తవం, డిసెంబర్ 01**



తిరుమల పరకామణి కేసు విచారణ సోమవారం పూర్తయ్యింది. ఈ కేసుకు సంబంధించి డిసెంబర్ 2న (మంగళవారం) నివేదికను సమర్పించాల్సిందిగా హైకోర్టు గడువు విధించిన విషయం తెలిసిందే. దీంతో సిఐడి అధికారులు హైకోర్టుకు నివేదికను సమర్పించే అవకాశం ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు పరకామణి కేసును అక్టోబర్ 27న సిఐడి అడిషనల్ డిజి రవిశంకర్ అయ్యనార్ నేతృత్వంలో సిఐడి విచారణ చేపట్టింది. ఈ కేసులో వైసిపి ప్రభుత్వ హయాంలో టిటిడి ఛైర్మన్లుగా పని చేసిన వైవి సుబ్బారెడ్డి,

- మిగతా 2లో..

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# సభలో డ్రామాలు వద్దు...

(మొదటిపేజీ తరువాయి)

కాదని, దేశాన్ని శరవేగంతో ప్రగతి పథంలో నడిపించే ప్రయత్నాలకు కొత్త శక్తినిచ్చే మార్గమని ప్రధాని అన్నారు. "భారతదేశం ప్రజాస్వామ్య స్ఫూర్తితో జీవిస్తోంది. ఇటీవలి బీహార్ ఎన్నికల్లో భారీగా పోలైన ఓటింగ్, ముఖ్యంగా మహిళల భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని బలపరిచింది. ప్రజాస్వామ్యం ద్వారా ఫలితాలు సాధించగలమని భారత్ నిరూపించింది. ప్రపంచం మన ప్రజాస్వామ్య, ఆర్థిక వ్యవస్థల బలాన్ని నిశితంగా గమనిస్తోంది" అని ఆయన వివరించారు.

విపక్షాల వైఖరిని ప్రధాని తీవ్రంగా తప్పుబట్టారు. "దేశం కోసం పార్లమెంటు ఏం ఆలోచిస్తోంది, ఏం చేయాలనుకుంటోంది అనే దానిపై ఈ సమావేశాల్లో దృష్టి సారించాలి. ఇటీవలి ఎన్నికల ఓటమి బాధ నుంచి విపక్షాలు బయటకు వచ్చి, తమ బాధ్యతను నిర్వర్తించాలి. కానీ దురదృష్టవశాత్తూ కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటమిని అంగీకరించలేకపోతున్నాయి" అని మోదీ విమర్శించారు. బీహార్ ఎన్నికలు ముగిసి రోజులు గడిచినా, వారి మాటలు వింటుంటే ఓటమి బాధ ఇంకా వదిలినట్టు లేదని ఆయన ఎద్దేవా చేశారు. సభలో కొత్తగా ఎన్నికైన, యువ ఎంపీలకు మాట్లాడే అవకాశం లభించడం లేదని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "తొలిసారి ఎన్నికైన వారు, యువతరం ఎంపీలు సభలో మాట్లాడలేకపోతున్నారు. తమ ప్రాంత సమస్యలను వినిపించలేకపోతున్నారు. దేశాభివృద్ధికి అనుకూలంగా మాట్లాడినా వారిని అడ్డుకుంటున్నారు. వారికి అవకాశం కల్పించడం మనందరి బాధ్యత" అని ఆయన అన్నారు.

"డ్రామాలు చేయడానికి చాలా చోట్లున్నాయి, ఎవరైనా అక్కడ చేసుకోవచ్చు. కానీ ఇక్కడ జరగాల్సింది డెలివరీ, డ్రామా కాదు. నినాదాలు చేయడానికి దేశం మొత్తం ఉంది. ఎక్కడ ఓడిపోయారో అక్కడ నినాదాలు చేశారు, రేపు ఎక్కడ ఓడిపోతారో అక్కడ కూడా చేయొచ్చు. కానీ పార్లమెంటులో మాత్రం విధానాలపైనే దృష్టి పెట్టాలి" అని ప్రధాని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో నెగిటివిటీ పనికొస్తుందేమో గానీ, దేశ నిర్మాణానికి సానుకూల దృక్పథమే అవసరమని ఆయన హితవు పలికారు. కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ప్రజా వ్యతిరేకత కారణంగా సొంత రాష్ట్రాల్లో పర్యటించలేని స్థితిలో ఉన్నాయని, అలాంటి పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.పి. రాధాకృష్ణన్‌కు ప్రధాని అభినందనలు తెలిపారు.

# ప్రజా సమస్యలపై చర్చ లేనప్పుడు పార్లమెంటు ఎందుకు.?

(మొదటిపేజీ తరువాయి)

ఈ అంశాలపై పార్లమెంటులో చర్చిద్దామని, వీటిపై చర్చ లేనప్పుడు ఇక పార్లమెంట్ దేనికని ఆమె ప్రశ్నించారు. ప్రజా సంబంధ అంశాలపై సభలో మాట్లాడటం లేదా లేవనెత్తడం డ్రామా అని అనడం సరికాదని ఆమె అన్నారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అని ఆమె అభివర్ణించారు. కాగా, సోమవారం శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. నేటి నుంచి 19వ తేదీ వరకు సమావేశాలు జరగనున్నాయి.

# నాణ్యతా ప్రమాణాలు పాటించండి

(మొదటిపేజీ తరువాయి)

ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని.. ఏ మాత్రం పొరపాటు దొర్లినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. రాతి పనులతో పాటు రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గద్దెల చుట్టూ భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, భక్తులు వేచి చూసే ప్రదేశాలు ఇలా ప్రతి ఒక్క అంశంపైనా సీఎం అధికారులకు సూచనలు చేశారు. పనులు సాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించారు. తద్వారా పలు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, స్థపతి శివనాగిరెడ్డి సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు పెద్ద పీట వేయాలని దిశా నిర్దేశం చేశారు. నిర్దేశిత సమయంలోనే అభివృద్ధి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి కే.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ శాఖ కమిషనర్ హరీశ్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన పరకామణి కేసు విచారణ

(మొదటిపేజీ తరువాయి)

కరుణాకర్ రెడ్డి, అప్పటి ఇఒ ధర్మారెడ్డితో పాటు మొత్తం 35 మందిని సిఐడి అధికారులు విచారించారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడు సిఐ సతీష్ కుమార్ విచారణకు వెళ్తూ హత్యకు గురవడం మరో సంచలనం. చెన్నై, బెంగుళూరు, విశాఖపట్నం, హైదరాబాద్, తిరుపతిల్లో నిందితుడు రవికుమార్, ఆయనకు సంబంధించిన వారి ఆస్తులను పరిశీలించి, వాటి డాక్యుమెంట్లను సిఐడి సేకరించింది. గత ప్రభుత్వంలో లోక్‌అదాలత్ రాజీ నేపథ్యంలో తిరుపతి రెండవ అదనపు కోర్టు సిబ్బందినీ సిఐడి అధికారులు ప్రశ్నించారు. సోమవారంతో ఈ కేసు విచారణ పూర్తవడంతో సుమారు 156 పేజీల నివేదికను హైకోర్టుకు సిఐడి సమర్పించే అవకాశం ఉంది. దీంతో కేసుతో సంబంధమున్న వారి గుండెల్లో గుబులు మొదలైంది.

# ప్రజా సంక్షేమంలో ఏపీనే నంబర్ వన్...

(మొదటిపేజీ తరువాయి)

నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు జిల్లాలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి, వారితో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరులో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నాగలక్ష్మి అనే మహిళ ఇంటికి సీఎం స్వయంగా వెళ్లారు. ఆమెకు నెలవారీ పింఛన్‌ను అందజేసి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె పిల్లలతో కాసేపు ముచ్చటించి, కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే ఒక్క పింఛన్ల పంపిణీకే రూ.50,763 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. దేశంలో మరే రాష్ట్రం కూడా సంక్షేమం కోసం ఈ స్థాయిలో ఖర్చు చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. "మేము ఏటా రూ.32,143 కోట్ల చొప్పున ఐదేళ్లలో పింఛన్ల కోసం రూ.1.65 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాం. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు కూడా ఇంత భారీ మొత్తంలో ఖర్చు చేయడం లేదు" అని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 63 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ప్రతినెలా రూ.2,739 కోట్లు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. "రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 13 మందికి పింఛన్లు అందిస్తున్నాం. పింఛన్లు అందుకుంటున్న వారిలో 59 శాతం మహిళలే ఉన్నారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన రూ.50,000 కోట్లలో రూ.30,000 కోట్లు మహిళలకే అందాయి" అని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ఈ నెల కొత్తగా 7,533 మందికి వితంతు పింఛన్లు మంజూరు చేస్తున్నామని, దీనివల్ల అదనంగా రూ.3 కోట్ల భారం పడుతుందని వెల్లడించారు.

గత ఐదేళ్లలో లబ్ధిదారుడు ఒక్క నెల పింఛన్ తీసుకోకపోయినా, వారి పింఛన్‌ను రద్దు చేసేవారని చంద్రబాబు గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, రెండు నెలలుగా పింఛన్ తీసుకోని 1,39,677 మందికి రూ.114 కోట్లు, మూడు నెలలుగా తీసుకోని 13,325 మందికి రూ.16 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. 1984లో టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు పింఛన్ల పథకాన్ని ప్రారంభించారని, తాము దాన్ని దశలవారీగా పెంచుతూ ప్రస్తుతం రూ.4,000 అందిస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ ఇవ్వడాన్ని బాధ్యతగా తీసుకున్నామని అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి చిన్నారికి ఏటా రూ.15,000 ఆర్థిక సహాయాన్ని 'తల్లికి వందనం' పథకం కింద అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'సూపర్ సిక్స్' పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు.

విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకే ప్రజలు కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని తెలిపారు. "దీపం-2 కింద ఏటా 3 సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నాం. ఇప్పటివరకు 2.85 కోట్ల సిలిండర్లను ఉచితంగా అందించాం. ఇందుకోసం రూ.2,104 కోట్లు ఖర్చు చేశాం. 'స్త్రీ శక్తి' పథకం కింద నేటి వరకు 25 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం" అని చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా జనాభా సమతుల్యత ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. జనాభా క్షీణించడం ఆందోళన కలిగించే విషయమని, జనాభా సమతుల్యత దేశాన్ని, రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడానికి సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు.

# అలక వీడి ప్రజల మనసులు గెలవండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల మనస్సులు గెలుచుకునే విధంగా పనిచేసి స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవాలని దిశానిర్దేశం చేశారు. టిడిపి యూనివర్సిటీ లాంటిందన్నారు. మై టిడిపి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, యాప్ ద్వారానే పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తామన్నారు. గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్రస్థాయి నేతలుగా, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉపముఖ్యమంత్రులుగా పనిచేయాలనేది పార్టీ సిద్ధాంతం, విధానమని చెప్పారు. వైసిపి ఐదేళ్ల రాక్షస పాలన ఎలా ఉందో చూశామని తెలిపారు. ప్రజల మనస్సులు గెలుచుకునే విధంగా పనిచేయాలని, స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవాలని చెప్పారు.కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. పనిచేసే వారిని ప్రోత్సాహిస్తామన్నారు. అందరం ఒకే లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేస్తేనే విజయాలు సాధిస్తామన్నారు. కష్టం లేనిదే ఫలితం లేదని, అందరూ కష్టపడాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, మాజీమంత్రులు ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, విధులు, బాధ్యతలపై మార్గదర్శనం చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల అభిప్రాయాలను లోకేష్‌కు నివేదించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించినన పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

# నెలకు రెండుసార్లు విచారిస్తాం

## - విద్యార్థుల కోసం కోర్సులు
## - ఢిల్లీ వాయుకాలుష్యం కేసుపై సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం, డిసెంబర్ 01:** ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వాయుకాలుష్య సమస్య కేసు శీతాకాలంలో మాత్రమే విచారణ చేయాల్సిన 'ఆచారం' కేసుకాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సమస్యకు స్వల్ప, దీర్ఘకాలిక పరిష్కారాలను కనుగొనడానికి నెలలో రెండుసార్లు విచారణ చేస్తామని స్పష్టం చేసింది. అలాగే, పంట వ్యర్థాల దహనం సమస్య అనవసరంగా రాజకీయ సమస్య లేదా ఇగో సమస్యగా మారకూడదని తెలిపింది. ఢిల్లీవాయుకాలుష్యం కేసును సోమవారం ప్రధాన న్యాయమూరి సూర్యకాంత్, న్యాయ మూర్తి జోరు మల్యబాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారించింది. వాయుకాలుష్యానికి రైతుల పంట వ్యర్థాల దహనం అంశం ఒక్కటే కారణం కాదని, ఇతరాంశాలూ ఇందులో ఉన్నాయని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ కోర్టులో లేని వ్యక్తులు (రైతులు)పై భారాన్ని మోపడం సరికాదు కాబట్టి, పంట వ్యర్థాల దహనం అంశం గురించి వ్యాఖ్యానించాలనుకోవడం లేదని సిజెఐ తెలిపారు. వాయు కాలుష్యాన్ని ఎదుర్కొవడానికి తీసుకుంటున్న తక్షణ, దీర్ఘకాలిక చర్యల గురించి తెలియ జేయాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్(సీఎక్యూఎం), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ)లను సీజేఐ ఆదేశించారు.తదుపరి విచారణను ఈనెల 10కి వాయిదా వేశారు.

# పట్టణాభివృద్ధి బలోపేతానికి లీన్ కన్‌స్ట్రక్షన్ : మంత్రి నారాయణ

**ఏర్పేడు-సూర్య వాస్తవం, డిసెంబర్ 01 :** పట్టణాభివృద్ధి బలోపేతానికి లీన్ కన్‌స్ట్రక్షన్ ఉపయోగకరంగా ఉంటుందని ఎపి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ అన్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని ఐఐటిలో నాలుగు రోజులపాటు జరుగుతున్న 8వ ఇండియన్ లీన్‌కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్ ఇండిస్టీ డే ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. కాన్ఫరెన్స్‌కు దేశంలోని వివిధ కంపెనీల ప్రతినిధులు, విద్యావేత్తలు హాజరవడం సంతోషంగా ఉందన్నారు. నిర్మాణ రంగంలో తక్కువ టైంలో పెట్టుబడి తగ్గించి, మంచి క్వాలిటీని, క్వాంటిటీని బలపరిచే విధంగా లీన్ కన్‌స్ట్రక్షన్ పనిచేస్తుందని వివరించారు.

# నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం...

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం ఇది తీవ్ర వాయుగుండంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. ఈ తీవ్ర వాయుగుండం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా కదులుతోందని, సోమవారం మధ్యాహ్నానికి వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని తెలిపింది. ఈ వాయుగుండం ప్రభావంతో ముఖ్యంగా నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కోస్తాంధ్రలోని ఇతర ప్రాంతాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని ఆయన వివరించారు.

దీని ప్రభావంతో దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# మానవత్వం మరిచారా...?

## - ఆరోగ్య శాఖ అధికారుల దారుణం
## - వైరస్ సోకినా చిన్నారులతో సంచులు మొయించిన వైనం
## - ఆగ్రహం వ్యక్తం చేసిన సామజిక వేత్త డిస్కవర్ అనంతపురం అనిల్
## - కలెక్టర్ సారూ..... జర చూడండి




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 1 :** బాలలతో పనులు చేయించుకోవడం తప్పు అందులోను వైరస్ సోకినా చిన్నారులను కూలీలుగా మార్చేశారు డి ఏం ఏచ్ ఓ అధికారులు. డిసెంబర్ 1న, 2025 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం లోని డీఎంహెచ్ఓ ఆఫీస్ లో నిర్వహించిన తీరు సర్వత్ర విమర్శలకు దారి తీస్తుంది. ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచే కార్యక్రమానికీ హాజరైన ఉన్నతాధికారుల సాక్షిగా ఈ వైరస్ సోకిన చిన్నారులతో పోషక ఆహార సంచులు గ్రౌండ్ ఫ్లోర్ నుండి మూడవ అంతస్తు కు బరువును మోయించారు.చిన్న పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం అందులోను వైరస్ సోకిన పిల్లలతో పనులు చేయించుకుంటున్న డీ ఏం ఏచ్ ఓ అధికారుల తీరుపై సామజిక వేత్త డిస్కవర్ అనిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలతో చేయించాల్సిన పనులను పిల్లలతో తో చేయిస్తారా? అని అయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నుంచి వాక్ అవుట్ చేసారు.చిన్నపిల్లలతో వెట్టి చాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ప్రకటనలతో ఉదారకొట్టే అధికారులు మరి ఆరోగ్య శాఖ అధికారుల పై ఎలా స్పందిస్తారో చూడాలి. మానవత్వం మరిచిన ఆరోగ్య శాఖ తీరు చూసి జిల్లా వాసులు చీదరించుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుకుంటున్నారు.

# ఢిల్లీ చేరుకున్న ఏపీ మంత్రులు

**- ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత**
**- నేడు కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్ సింగ్‌తో భేటీ**
**- 'మొంథా' తుఫాను నష్టంపై సమగ్ర నివేదిక అందజేత**
**- ఏపీ మంత్రులకు స్వాగతం పలికిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు**



**అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 01 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత ఢిల్లీకి చేరుకున్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్, హోంమంత్రిగా వంగలపూడి అనిత సోమవారం హస్తినకు వెళ్లారు. ఢిల్లీ విమానాశ్రయంలో వారికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు ఎంపీలు, టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సానా సతీష్, కేశినేని శివనాథ్, లావు కృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాద్ రావు, పార్థసారథి, అప్పలనాయుడు, బస్తిపాటి నాగరాజు, భరత్, అంబికా లక్ష్మీనారాయణ ఉన్నారు. వీరితో పాటు టీడీపీ సీనియర్ నేతలు కంభంపాటి రామ్మోహన్ రావు, కనకమేడల రవీంద్ర కుమార్ కూడా మంత్రులకు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రులు లోకేశ్, అనిత మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో వేర్వేరుగా భేటీ కానున్నారు. ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన 'మొంథా' తుఫాను వల్ల జరిగిన నష్టంపై రూపొందించిన సమగ్ర నివేదికను కేంద్ర మంత్రులకు అందించి, సహాయం కోరనున్నారు. తుపాను ప్రభావం, పంట నష్టం, పునరావాస చర్యలకు అవసరమైన నిధులపై వారు చర్చించనున్నారు.

# అన్యమతస్తులను గుర్తించండి

**- తదుపతి చర్యకు నివేదిక తయారు చేయండి : టిటిడి ఈవో**
**- టిటిడి పరిధిలోని ఆలయాల్లోనూ అన్నప్రసాదాలు**



**తిరుపతి -సూర్య వాస్తవం, డిసెంబర్ 01 :** టిటిడిలో ఇంకా ఎవరైనా అన్యమతస్తులు ఉంటే వారిని గుర్తించి తదుపరి చర్య కోసం నివేదిక తయారు చేయాలని అధికారులను టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశించారు. టిటిడి పరిధిలోని ఇతర ఆలయాల్లోనూ తిరుమల తరహాలో యాత్రికులకు అన్నప్రసాదాలను అందించాలని సూచించారు. టిటిడిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై టిటిడి పరిపాలనా భవనంలోని తన ఛాంబర్‌లో సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ%ా% టిటిడి ఆధ్వర్యంలోని ఆలయాలలో అన్నప్రసాదాల పంపిణీకి సంబంధించి పోటు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, అన్నప్రసాదాల పంపిణీ పటిష్టంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టిటిడి ఆలయాలలో ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న అన్నప్రసాదాలపై రోజు వారి నివేదికను తయారు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా టిటిడి పరిధిలో చేరిన చారిత్రాక ఆలయాలకు, ఇతర ఆలయాలకు ఏయే ఆలయాలకు వేద పారాయణదారులను నియమించాలి, ఎంత మంది అర్చకులను నియమించాలనే అంశంపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. పోటు వర్కర్ల పదాన్ని ముఖ్య పాచిక, పాచికగా మార్చాలని టిటిడి బోర్డులో నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడి వేగంగా పోటు వర్కర్ల పేర్లను మార్చే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆలయ విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 25 ఎకరాలలో ఇది వరకే ఉన్న ఆలయంతో పాటు ఇకపై నిర్మించనున్న కల్యాణ కట్ట, అర్చకులు, సిబ్బంది క్వార్టర్స్, ప్రాకారం, గోపురాలు, పుష్కరిణి తదితర నిర్మాణాలపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెఇఒ వి. వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ కే.వి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బోయింగ్ వైడ్-బాడీ విమానాలు నడపాలి

**- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరిన టిడిపి ఎంపిలు**



**న్యూఢిల్లీ - -సూర్య వాస్తవం, డిసెంబర్ 01 :** విజయవాడ-హైదరాబాద్, రాజమండ్రి-విజయవాడ మధ్య బోయింగ్ వైడ్-బాడీ విమానాలు నడపాలని టిడిపి ఎంపిలు కేశినేని శివనాథ్, జిఎం హరీష్ కోరారు. పార్లమెంట్‌లో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును టిడిపి ఎంపిలు సోమవారం కలిసి విజయవాడ, రాజమండ్రి విమానాశ్రయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. విజయవాడ %-% హైదరాబాద్ మధ్య డొమిస్టిక్ విమాన సర్వీసులున్నప్పటికీ, వాటి టిక్కెట్ ధరలు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటున్నాయని, సీట్లు అందుబాటులో వుండటం లేదని చెప్పారు. విజయవాడ-సింగపూర్ మధ్య అంతర్జాతీయ విమాన ప్రయాణం టిక్కెట్ ధర సుమారు రూ.7 వేలకే లభిస్తుందని తెలిపారు. ఎటిఆర్ విమానాల్లో లగేజీ సామర్థ్యం తక్కువగా వుండటంతో ప్రయాణికుల లగేజీ వేరే విమానాలతో పంపిస్తున్నారన్నారు. ఇందువల్ల విదేశాలకు వెళ్లే ప్రయాణికులు సరైన సమయంలో కనెక్టివిటీ విమానాలు అందుకోలేకపోతున్నారని తెలిపారు. విజయవాడ నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ఉండటం వల్ల ఇంటర్నేషనల్ కనెక్టివిటి ఉండేలా ముంబయి, ఢిల్లీ విమానాశ్రయాలకు (ఎరైవల్, డిపార్చర్) విమాన సర్వీసులను నడపాలని కోరారు. గన్నవరం విమానాశ్రయంలో నేషనల్ టెర్మినల్ ప్రారంభమయ్యేలోపు నేషనల్ కనెక్టివిటి పెరిగేందుకు విజయవాడ నుంచి వారణాసి, అహ్మదాబాద్, పుణే, కొచ్చిన్, గోవా విమాన సర్వీసులు నడిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఈ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి మూడు రోజుల్లో పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

# పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నట్లు జరగాలి

**- రాష్ట్రంలో ఎన్డీయే కూటమి 15-20 ఏళ్లు అధికారంలో ఉండాలన్న ముఖ్యమంత్రి**
**- 2047 నాటికి స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడతామని వ్యాఖ్య**
**- నటనతో కష్టపడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన**



**అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 01**
ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నట్లుగా రాష్ట్రంలో ఎన్డీయే కూటమి 15-20 ఏళ్లు అధికారంలో ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఏలూరు జిల్లాలో 'పేదల సేవలో' ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం బాబాయిని గొడ్డలితో చంపి వేరే వారిపై నెపం నెట్టే నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. మంచి సంకల్పంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. తలసరి ఆదాయం రూ. 3 లక్షల నుంచి రూ. 58 లక్షలకు పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కొందరు నటనతో కష్టపడుతున్నట్లు కనిపిస్తారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలంగాణలో ప్రభుత్వం 10 ఎకరాల భూమిని వేలం వేస్తే రూ.1,350 కోట్ల రాబడి సమకూరిందని, ఇదంతా గతంలో తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధి వల్లే సాధ్యమైందని వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ రూ.1.40 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిందని వెల్లడించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ సహా మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు వేసినట్లు చెప్పారు.

అమరావతిని కూడా ఉద్యోగాల కల్పనకు కేంద్రంగా మార్చబోతున్నామని అన్నారు. మొదటి దశ పనులు 2028 నాటికి పూర్తవుతాయని తెలిపారు. గత పాలకుల ఐదేళ్ల హయాంలో అభివృద్ధి ఊసే లేదని విమర్శించారు. గత ఐదేళ్ల పాలనకు, కూటమి 18 నెలల పాలనకు వ్యత్యాసం ఉందని అన్నారు. జనవరిలోగా రాష్ట్రంలో గుంతల రోడ్లన్నీ పూడ్చి బాగు చేస్తామని, అవసరమైతే కొత్త రహదారులు నిర్మిస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవిని ప్రాజెక్టును తీసుకు వస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. జీవన ప్రమాణాలు పెరగాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. గంజాయిపై గత పాలకులు కఠినంగా వ్యవహరించలేదని ఆరోపించారు. గంజాయి డాన్‌గా మారిన ఒక మహిళ కూడా ఇప్పుడు బయటకు వచ్చారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత ప్రమాదకరమో ఈ ఒక్క ఘటన చూస్తే అర్థమవుతుందని అన్నారు. రైతులు డిమాండ్ ఆధారిత పంటలు వేసి ఎక్కువ ప్రయోజనం పొందాలని సూచించారు. సమీకృత వ్యవసాయ విధానాలను అవలంభించాలని అన్నారు. డ్రోన్ సాంకేతికతను వినియోగించి వ్యవసాయ వ్యయాన్ని తగ్గించుకుని, దిగుబడి పెంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆక్వా కల్చర్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.850 కోట్లను భరిస్తోందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని రైతులకు సూచించారు.

కొబ్బరి, కోకో, కాఫీ వంటి పంటలు ఉన్నాయని, కాబట్టి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధి ఇస్తామని మాట ఇచ్చి దానిని అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని వెల్లడించారు. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సు ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, వీటి ద్వారా వేలాది ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ఏలూరు వంటి జిల్లాలకు పెద్ద ఎత్తున పరిశ్రమలు రావాలని అన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూయర్ కింద చేయూత అందిస్తామని హామీ ఇచ్చారు. కొల్లేరులో ఉన్న సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని చంద్రబాబునాయుడు అన్నారు.

2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికి ఓ గేమ్ ఛేంజర్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గోదావరి, కృష్ణా డెల్టాల్లో నీటి ఎద్దడి సమస్య ఉండదని ఆయన అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు చూడాలని అన్నారు. అనంతపురం జిల్లాకు నీళ్లు ఇవ్వడం వల్ల ఆ ప్రాంత ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని చంద్రబాబునాయుడు అన్నారు.

# ఏపీ సినిమాటోగ్రఫీలో నూతన శకం ప్రారంభం

**- ముంబైలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేశ్**
**- ఏపీని దేశంలోనే ఉత్తమ సినిమా షూటింగ్ ప్రదేశంగా తీర్చిదిద్దుతామని వెల్లడి**
**- ప్రపంచస్థాయిలో తెలుగు సినిమా ఒక గ్లోబల్ బ్రాండ్‌గా నిలుస్తోందని వ్యాఖ్య**
**- రాష్ట్ర సినిమాటోగ్రఫీలో ఒక నూతన శకం ప్రారంభమైందని స్పష్టం**




**అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 01**
ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఒక గ్లోబల్ బ్రాండ్‌గా గుర్తింపు పొందుతున్న ఈ తరుణంలో, రాష్ట్ర సినిమాటోగ్రఫీ రంగంలో ఒక నూతన శకం ప్రారంభ మైందని ఆయన అన్నారు. ముంబైలో జరుగుతున్న 'సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ - 2025'లో సోమవారం ఆయన పెట్టుబడిదారులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలుగు చిత్ర పరిశ్రమ సాధిస్తున్న విజయాలను ప్రస్తావిస్తూ, ఏపీలో సినిమా నిర్మాణానికి ఉన్న అపార అవకాశాలను వివరించారు. రాష్ట్రంలో సినీ నిర్మాణ కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

చిత్రీకరణలకు అవసరమైన సులభమైన అనుమతులు, మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఏపీని సినీ పరిశ్రమకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుస్తామని మంత్రి దుర్గేశ్ తెలిపారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి సినీ రంగంలో మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ఏపీ సినిమాటోగ్రఫీ రంగంలో నూతన శకానికి శ్రీకారం చుడుతూ, ముంబయిలో జరుగుతున్న 'సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ - 2025'లో ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాటా గారితో కలిసి పాల్గొని ఆంధ్రప్రదేశ్‌లో ఫిల్మ్, టూరిజం రంగాల భవిష్యత్తు అవకాశాలను ఇన్వెస్టర్లకు వివరించాను. తెలుగు చిత్ర పరిశ్రమ ఈరోజు భారతదేశంలో రెండవ అతిపెద్ద ఇండస్ట్రీగా నిలదొక్కుకొని, బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప, కల్కి 2898 ఏడీ వంటి బ్లాక్‌బస్టర్‌లతో తెలుగు సినిమాను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చిన తీరును ఈ సందర్భంగా గుర్తు చేశాను. ఏపీలో 1,100 పైగా సినీ స్క్రీన్లు ఉండటం మన రాష్ట్రం సినీ రంగానికి ఎంత ముఖ్యమైన కేంద్రంగా ఎదిగిందో తెలిపే ఉదాహరణ.

తెలుగు సినిమా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని ఆవిష్కరించనున్నట్లు ఇన్వెస్టర్లకు తెలియజేశాను. ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీలు, ఆధునిక స్టూడియోలు, డబ్బింగ్ మరియు రీ-రికార్డింగ్ సౌకర్యాల నిర్మాణానికి ప్రభుత్వం సంపూర్ణమైన మద్దతు అందిస్తుందని స్పష్టం చేశాను. షూటింగ్‌ల కోసం ప్రభుత్వ మరియు బహిరంగ ప్రాంతాల్లో అనుమతులు వేగంగా, పారదర్శకంగా లభించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. అలాగే కళాకారులు, సాంకేతిక నిపుణులను గౌరవించేందుకు ప్రతిష్ఠాత్మక నంది అవార్డులు మరియు నంది నాటకోత్సవాలను త్వరలోనే పునరుద్ధరించనున్నట్లు ప్రకటించాను. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అపూర్వమైన అవకాశాలు ఉన్నాయని ఇన్వెస్టర్లతో జరిగిన సమావేశాల్లో వివరించాను. పర్యాటక, ఆతిథ్య రంగాలకు 'ఇండస్ట్రీ స్టేటస్' ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం భూమి కొనుగోలు/లీజుపై 100 శాతం స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీల మినహాయింపు, 15 సంవత్సరాలకు 100 శాతం ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్ వంటి లాభదాయకమైన రాయితీలను కల్పిస్తున్నట్లు తెలియజేశాను. స్వర్ణాంధ్ర విజన్-2047 లో భాగంగా, %ూ×, ఎఖీఠ%, గేమింగ్ రంగాలను అభివృద్ధి చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను 'ఆంధ్రా వ్యాలీ'గా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. సినిమాటోగ్రఫీని, పర్యాటకాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని సమన్వయం చేస్తూ ఏపీ అందాలను ప్రపంచానికి పరిచయం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో కృషి చేస్తున్నాం. విశాఖపట్నం, అరకు, లంబసింగి, శ్రీశైలం, తిరుపతి, రాజమండ్రి వంటి ప్రాంతాలను ప్రధాన యాంకర్ హబ్‌లుగా అభివృద్ధి చేస్తూ 21 థీమాటిక్ సర్క్యూట్‌లలో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం.

సమ్మిట్‌లో భాగంగా సోనీ, యూట్యూబ్ ఇండియా, క్యూబ్ సినిమా, ఇమాజికా వరల్డ్, థామస్ కుక్ వంటి ప్రముఖ సంస్థల, సీఐఐ ప్రతినిధులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలపై చర్చించాము. మీడియా అండ్ ఎంటర్టైన్‌మెంట్ రంగ భవిష్యత్తు వృద్ధికి ఏపీ కీలకంగా నిలుస్తుందని నమ్ముతున్నాం. బాధ్యతాయుతమైన, పారదర్శకమైన, వ్యాపార అనుకూలమైన పాలనతో భారతీయ మీడియా %డ% ఎంటర్‌టైన్‌మెంట్ రంగాన్ని $100 బిలియన్ స్థాయికి తీసుకెళ్లే ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంటుందని విశ్వసిస్తున్నాను" అని కందుల దుర్గేశ్ వివరించారు.

## గవర్నమెంట్ స్కూల్‌కు రూ.1,18,000 విరాళం



**గాండ్లపెంట - సూర్య వాస్తవం, డిసెంబర్ 01 :** మండల కేంద్రంలోని కటారిపల్లి గ్రామంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ హై స్కూల్ కు విద్యార్థుల స్పోర్ట్స్ జెర్సీ కోసం వేమన పూజారి తుంగ నందా రెడ్డి 18000 రూపాయలు పాఠశాల ప్రధానో పాధ్యాయులు సరళాకు చెక్కుఅంద చేశారు. అదేవిధంగా కటారపల్లి గ్రామంలోని ప్రైమరీ మోడల్ స్కూల్ కు వంటగది నిర్మాణం కోసం లక్ష రూపాయలు విరాళం ఇచ్చినట్టు ప్రకటించారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నటువంటి వేమన పూజారి తుంగ నంద వేమారెడ్డి గారికి ఉపాధ్యాయులందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.

## వృద్ధుల ఆర్థిక భరోసా కోసం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**- మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ**



**నాయుడుపేట- సూర్య వాస్తవం, డిసెంబర్ 01:** నాయుడుపేట పట్టణంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ సోమ వారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ సచివాలయ సిబ్బందితో కలిసి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ షేక్ రఫీ మాట్లాడుతూ, వృద్ధులు, వికలాంగులు, విధవులు, నిరు పేదలు వంటి వారి జీవనోపాధికి ఎన్టీఆర్ భరోసా పథకం పెద్ద సహా యమవుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్లు ప్రజల చెంతకు చేర్చేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టిందని తెలిపారు. ఎవరికైనా పెన్షన్ సంబంధించిన సమస్యలు ఉన్నా సచివా లయం ద్వారా వెంటనే పరిష్కరించబడతాయని ఆయన హామీ ఇచ్చారు. పంపిణీ కార్యక్రమంలో సచివాలయ కార్మికులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

**గాండ్లపెంట- సూర్య వాస్తవం, డిసెంబర్ 01:** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గాండ్లపెంట పరిదిలోని కస్తూర్భగాంధి బాలిక విద్యాలయం కటారుపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెక్కమానులో వైద్యాధికారి డాక్టర్ మహేశ్వర మారుతి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి ఎలా వచ్చును, లక్షణాలను, నిర్ధారణ, ఉన్నవారికి అందించు సేవలను గురించి వివరించుచు, పౌష్టికారం వాటి ఉపయోగాలు, వ్యాధినిరోధక శక్తి తగ్గిన కలుగు దుష్పపరిమా ణాలు, ఎయిడ్స్ వ్యాధి పై ఎలా ప్రభావం చూపుతుందో తెలియపరచి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు నిర్వహి స్తారని, పరీక్ష ఫలితాలను గోప్యంగా ఉంచుతారని సందేహం ఉన్నవారు పరీక్ష చేయించుకోవచ్చునని తెలియ పర చారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి వివాహేతర సంబం ధాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామజిక ఆరోగ్య అధికారి నగేష్, డిప్యూటీ హెచ్ ఈవో విజయ్ కుమార్, హెడ్ మాస్టర్ ఖాదర్ వల్లి, ఎస్ఓ దుర్గాదేవి, గంగా ధర్, హరుల్, సూపర్‌వైజర్, ఉపేంద్ర రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ రష్మి, శిరీష ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరకట్న వేధింపులకు ఐఏఎస్ కుమార్తె ఆత్మహత్య

**- ఆలస్యంగా వెలుగులోకి..**



**తాడేపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 01:** వరకట్నం వేధింపులు తాళలేక ఐఏఎస్ కుమార్తె తనువు చాలించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న తర్వాత అనతి కాలంలోనే వరకట్న వేధింపులకు భర్త పాల్పడడంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి నవోదయ కాలనీలో ఆదివారం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు. ఎపిపిఎస్‌సి కార్యదర్శి ఎస్.చిన్నరాయుడు కుమార్తె మాధురి రాజేష్‌నాయుడు అనే యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ' మీ తండ్రి ఐఏఎస్ కనుక ఆయన వద్ద డబ్బులు ఉంటాయని, వాటిని తీసుకురావాలి' అని మాధురిని రాజేష్‌నాయుడు నిత్యం వేధించేవాడు. వేధింపులు తాళలేక ఆదివారం ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకుని మాధురి ఆత్మహత్య చేసుకున్నారు. వరకట్న వేధింపులు తాళలేకే తమ కుమార్తె బలవన్మరణానికి పాల్పడిందని చిన్నరాయుడు తెలిపారు. వేధింపులు తాళలేక గత నాలుగు నెలల క్రితం తమ కూతురు తాడేపల్లిలోని తమ ఇంటికి వచ్చిందని చెప్పారు. మానసికంగా తమ కూతురిని అల్లుడే చంపేశాడని మృతురాలి తల్లి ఆరోపించారు. ఈ కేసును మంగళగిరి డిఎస్‌పి మురళీకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

# నిశ్శబ్దాన్ని చేదిద్దాం.. హెచ్ఐవి గురించి చర్చిద్దాం






**గుంతకల్లు-సూర్య వాస్తవం, డిసెంబర్ 1**
ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పిపి యూనిట్ డాక్టర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆహ్వానితులుగా జూనియర్ సివిల్ జడ్జ్ మంజుల, డాక్టర్ జయ వర్ధన్ రెడ్డి హాజరై ఏరియా హాస్పిటల్ మరియు ప్రగతి మైత్రి మహిళా సంఘం నందు ర్యాలీ మరియు ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సంవత్సరం అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లాలో హెచ్ఐవి వ్యాధి తగ్గుముఖం పడుతోందని, భవి ష్యత్తులో హెచ్ఐవి రహిత జిల్లాగా అనంతపురం జిల్లాను నిలిపేందుకు కృషి చేయాలని తెలిపారు. వీటితోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసీటీసీ కేంద్రాలలో ఉచితంగా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడంతో పాటు, హెచ్ఐవి ఉందని నిర్ధారణమైన వారికి ఏ.ఆర్.టి కేంద్రాల ద్వారా ఉచితంగా చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. ఓ యువత మేలుకో హెచ్ఐవి గురించి తెలుసుకో నిశ్శబ్దాన్ని చేదిద్దాం హెచ్ఐవి గురించి చర్చిద్దాం అనే నినాదాలతో ఏరియా ఆస్పత్రి నుండి బయలుదేరీ ఎన్ టి ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ హరిత, వేణుగోపాల్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సూపర్వైజర్, యం ఓ అసిస్టెంట్ పద్మావతి, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్షన్ సేవలో ముందున్న ఏఎంసీ డైరెక్టర్

- రెడ్‌జోన్ భీమవరంలో ప్రజలకు అండగా ఇంటింటికీ పంపిణీ
- తుపానునూ పట్టించుకోని సేవ
- పెన్షన్ పంపిణీతో ఆదర్శం గోనుబాబు
- వృద్ధుల సమస్యలు తెలుసుకుని ధైర్యం చెప్పిన ఏఎంసీ డైరెక్టర్





**నాయుడుపేట- సూర్య వాస్తవం, డిసెంబర్ 01:** దిత్వా తుపాను ప్రభావంతో నాయుడుపేట మండలంలోని భీమ వరం గ్రామం రెడ్‌జోన్‌గా ప్రకటించిన కీలక పరిస్థితుల్లో కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న దృష్టితో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు ఏఎంసీ డైరెక్టర్ గోనుబాబు సోమవారం సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీని అత్యంత బాధ్యతగా నిర్వ హించారు. తీవ్ర వర్షం, ఈదురుగాలులు కొనసాగుతున్న ప్పటికీ, భీమవరం గ్రామం, పరిసర ప్రాంతాల్లో వృద్ధులు, వికలాంగులు, విధవలకు పెన్షన్లు ఇంటి వద్దకే చేరేలా గోనుబాబు స్వయంగా వ్యవస్థను పర్యవేక్షించారు. బయటకు రాలేని పెన్షనుదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులు, ఇబ్బందులు, తక్షణం అవసరమైన సహాయం వంటి అంశాలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.

"ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికోసం ప్రభుత్వ యంత్రాంగం మరింత చురుకుగా పనిచేయాలి. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే గారి ఆదేశాల ప్రకారం ఎవరూ పెన్షన్ కోల్పోకుండా చూసుకోవడం మా బాధ్యత" అని గోనుబాబు విలేకరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు. తుఫాను నడుమ బాధ్యతను నిర్వర్తించిన గోనుబాబు విధేయత, సేవాభావం స్థానికుల్లో విశేషంగా చర్చనీయాంశమైంది. రెడ్‌జోన్ పరిస్థితుల్లో కూడా ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందించడం ప్రజలు ఎంతో ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్, భీమవరం ఉపసర్పంచ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోను బాబు, వార్డు సభ్యులు అనాల రవి, టీడీపీ నాయకులు కోటపురి వెంకట సుబ్బయ్య, అగ్రికల్చరల్ అసిస్టెంట్ వంశీ, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, గ్రామస్తులు పాల్గొన్నారు.





## భారీ వర్షంలోనూ పెన్షన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ

**పెళ్లకూరు- సూర్య వాస్తవం, డిసెంబర్ 01:** దిత్వా తుఫాను ప్రభావంతో సూళ్లూరుపేట పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాన్ని లెక్కచేయకుండా, ప్రజలకు సేవ చేయడంలో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ముందుండి పనిచేశారు. సోమవారం సూళ్లూరు వాటర్ ట్యాంక్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఆమె స్వయంగా ఇంటింటికీ వెళ్లి అందించారు. పెన్షన్ పొందుతున్న వృద్ధుల, వికలాంగుల, విధవల ఆరోగ్యం, సమస్యలను ఎమ్మెల్యే ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. భారీ వానలోనూ ప్రజలతో దగ్గరగా కలిసిన ఎమ్మెల్యే సేవాభావాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు పచ్చవ మాధవ నాయుడు, వెంకట స్వామి, మేడా సాయి, హనుమంతరావు, కట్టబోయిన వెంకటేష్ యాదవ్, ఆలీ, కొండల్‌రావు, మునిరాజా, మునిసిపల్ కమిషనర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.





## ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు

**- సిఎస్ విజయానంద్**



**అమరావతి -సూర్య వాస్తవం, డిసెంబర్ 01 :** రబీ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సూచించారు. సచివాలయంలో అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ప్రజలంతా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను మరింతగా ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో రైతులకు ఎరువులు సమృద్ధిగా లభ్యమయ్యేలా చర్యలు తీసుకున్నట్లు సిఎస్‌కు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఐటి, ఆర్‌టిజిఎస్ ముఖ్యకార్యదర్శి భాస్కర్ కాటమనేని, సిఇఒ ప్రఖర్‌జైన్, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఎపి ఫైబర్‌నెట్ ఎమ్‌డి గీతాంజలి శర్మ, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒ ధాత్రిరెడ్డి, ఆర్‌టిజిఎస్ జాయింట్ డైరెక్టర్ మల్లికాగార్గ్ పాల్గన్నారు.

**ప్రైవేటు ఆలయాలపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలోని ప్రైవేటు ఆలయాల్లో యాత్రికుల రద్దీ పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. సచివాలయంలోని ఆర్‌టిజిఎస్‌లో పీపుల్స్‌పర్సెప్షన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో వరుసగా పండగలు, ప్రత్యేక పర్వదినాలు రానున్నాయని, రద్దీ నియంత్రణకు ఆలయ నిర్వాహకులు చేపడుతున్న చర్యల గురించి ముందుగా అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రైవేటు ఆలయాలు తమ పరిధి కాదనే నిర్లక్ష్యం అధికారుల్లో ఉండరాదన్నారు. రద్దీ సమయాల్లో ఆయా ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

## భవన నిర్మాణం కోసం రమేష్ నాయుడు రూ.25 వేలు విరాళం



**పులివెందుల -సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** పులివెందుల పట్టణంలోని జగనన్న కాలనీ కి వెళ్లే 100 అడుగుల రోడ్ మార్గాన స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణం కొరకు కె. వెలమ వారి పల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త గవర్న. రమేష్ నాయుడు 25 వేల రూపాయలు విరాళం మొత్తానికి ఆయన కార్యాలయలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ కోవిడ్ -19 విపత్తు లలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి బృందం చేసిన సేవలు వెల కట్టలేనివి అని అలాగే అంధత్వ నివారణ కోసం కార్నియా సేకరణ (నేత్రదానం) అమోఘం అని, విద్య, వైద్య, పర్యావరణ సంరక్షణ రంగాలలోనూ విశిష్ట సేవలు అందిస్తున్న స్నేహిత అమృత హస్తం సేవలను విస్తృతికి భవన నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని అందుకు నావంతు బాధ్యత గా ఈ విరాళం అందజేస్తున్నాను అని భవిష్యత్‌లో ఈ సంస్థకి మరింత సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం లో భాగస్వాములు అయిన రమేష్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి బృందం రాజు, మాల్యాద్రి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ అంతం మనందరి పంతం




**పులివెందుల -సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా పులివెందుల పట్టణం లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుండి పూల అంగళ్ళ కూడలి వరకు విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల చే నిర్వహించిన ర్యాలీ ని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఖాజా మొయిద్దీన్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రెసిడెన్షియల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్, మెడికల్ ఆఫీసర్ శాంతకుమార్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ ఐ వి అంతం మనందరి పంతం గా ప్రతి ఒక్కరు నడుం బిగించాలని, ప్రతి ఒక్కరు హెచ్ ఐ వి పరీక్ష చేయించుకోండి, సమాచారం తెలుసుకోండి, సురక్షితం గా ఉండండి అనే నినాదాలతో ఈ ర్యాలీ మహిళా డిగ్రీ కళాశాల నుండి శ్రీరామ థియేటర్, పాత బస్టాండ్ మీదుగా పూల అంగళ్ళ వరకు చేరుకుని అక్కడ మానవహారం గా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో డి పి ఎం సుబ్బారెడ్డి, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సతీష్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న, కౌన్సిలర్ లు వెంకటసుబ్బయ్య, బాదల్ వల్లి, సుమలత, సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, నాగల నాయక్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సి డి ఎస్ మేనేజర్ వల్లి, టెక్నీషియన్ నాగేష్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లెర్నర్స్ డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షలు

### - బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్



**పులివెందుల -సూర్యవాస్తవం, డిసెంబర్ 1:** పులివెందుల ఆర్టీవో కార్యాలయంలో సోమవారం బ్రేక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో లెర్నర్స్ డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో భాగంగా ఎల్ఎల్ఆర్ 6 మంది డిఎల్ 6 మంది లైసెన్స్ కోసం ఆన్లైన్లో అప్లై చేసుకోగా వారిని బ్రేక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ అధ్యక్షతన టెస్టులు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...లెర్నర్స్ డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష అనేది ప్రాథమిక ట్రాఫిక్ నియమాలు, రహదారి సంకేతాలు మరియు డ్రైవర్ బాధ్యతలపై కంప్యూటర్ ఆధారిత బహుళ-ఎంపిక ప్రశ్నల పరీక్ష. ఇది ఆన్‌లైన్‌లో లేదా ఆర్టీవో కార్యాల యంలో నిర్వహించబడుతుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులవడానికి రహదారి చిహ్నాలు, చేతి సంకేతాలు, రహదారి నియమాలు మరియు వాహన నిబంధ నలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచిస్తూ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది డ్రైవింగ్ లైసెన్స్ అప్లికేషన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

## మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు



**పులివెందుల -సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** పులివెందుల పట్టణ పరిధిలో కొలువై ఉన్న శ్రీమిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న అయ్యప్ప స్వామి మండల పూజ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివ రుద్ర చేతుల మీదుగా ఉదయాస్తమాన పరమ శివునికి, అయ్యప్పకు పంచా మృత అభిషేకం సహస్ర నామార్చన బిల్వార్చన భష్మాభిషేకం తదితర పూజ కైంకర్యాల అనంతరం పరమశివుడు అయ్యప్ప ప్రత్యేక అలంకారంలో భక్తు లకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... ప్రతి సోమవారం మిట్టమల్లేశ్వర స్వామికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకోవడం జరుగుతుందని, వాటిలో భాగంగా అయ్యప్ప స్వామి మండల పూజలు పురస్కరించుకొని ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణు ఘోషతో శివనామస్మరణతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు ఆలయ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అమృత హెల్త్ స్కీమ్ కార్డులు పంపిణీ చేసిన కలెక్టర్



**శ్రీ సత్యసాయిబ్యూరో -సూర్య వాస్తవం, డిసెంబరు 1:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతగా ప్రవేశపెట్టిన అమృత హెల్త్ స్కీమ్ ద్వారా జిల్లాలోని ఓల్డ్ ఏజ్ హెూమ్స్‌లో ఉన్న వృద్ధులు మరియు అనాథ శిశువులకు ఉచితవైద్య చికిత్సలు అందించ బడుతున్నాయని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ పథకం అమలులో భాగంగా... సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని రిజిస్టర్డ్ అనాథ శరణాలయాలు, వృద్ధుల ఆశ్రమాలకు చెందిన అనాథలు 55 మంది, వృద్ధులు 117 మంది మొత్తం 172 మంది లబ్ధిదారులకు అమృత హెల్త్ స్కీమ్ కార్డులను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అమృత హెల్త్ స్కీమ్ కార్డు కలిగిన లబ్ధిదారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎం పానల్డ్ హాస్పిటల్స్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఉచిత వైద్య సేవలు పొందవచ్చునని తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు మొదటినుండి చివరి వరకు పూర్తి ఉచితంగా నగదు రహిత వైద్య సేవలు అందించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా సంవత్సరానికి 25,00,000 రూపాయలు బీమా కవరేజీ కల్పించడం జరుగుతుందని, అలాగే పథకం ద్వారా 31 స్పెషాలిటీ కేటగిరీలలో 3,257 గుర్తించబడిన వ్యాధు లకు చికిత్సలు అందించబడును. 138.

గుర్తించిన వ్యాధులకు ఒక సంవత్సరము పాటు పూర్తి ఉచితంగా మందులు ఫాలోప్ అందించబడునని వివరించారు. సమాజంలోని అనాథలకు, ఓల్డ్ ఏజ్ హోమిల్లోఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఉన్న వృద్ధులకు ఆరోగ్య రక్ష ణను చేరవేసే మహత్తర సంకల్పంతో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ఆరోగ్యశాఖకు, వైద్యసేవలలో భాగస్వాములైన అధి కారులు, సిబ్బందికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భర్‌ద్వాజ్, డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, డిఎంహెచ్ఓ ఫైరోజా బేగం, డిసిహెచ్ఎస్ మధుసూదన్, ఐసిడిఎస్ పిడి ప్రమీల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే కోట్ల





**డోన్ -సూర్య వాస్తవం :** డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సోమవారం ఆసుపత్రిలోని అన్ని విభాగాలను స్వయంగా పరిశీలించి రోగుల సేవల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర విభాగం, ప్రసవ గది ఫార్మసీ, ల్యాబ్ సేవలు ఇన్‌పేషెంట్ వార్డులుప్రతి విభాగాన్ని ఎమ్మెల్యే సమీక్షించారు. రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సిబ్బంది పనితీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాల్సిన అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. పౌరులకు ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సదుపాయాల విస్తరణకు త్వరలో చర్యలు శుభ్రతపారిశుధ్యం మీద కఠిన నిఘా ఔషధాల అందుబాటుపై ప్రత్యేక దృష్టి ఉండాలని సూచించారు. డోన్ ఆరోగ్య వ్యవస్థను మరింత బలపరిచే దిశగా పలు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ఆస్పత్రి సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

**అనంతపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సీడాప్ జాబ్స్ విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ శైలజ తెలిపారు. ఇంటర్ చదివి, 19 నుంచి 26 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో సీడాప్ స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ద్వారా 90 రోజుల పాటు అనంతపురంలోని పంగల్ రోడ్డు వద్ద గల టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్లో ఉచిత భోజనం, వసతితో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె వివరించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ తో పాటు ప్రముఖ సంస్థల్లో కచ్చితంగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆమె వెల్లడించారు. అనంతపురంలోని టీటీడీసీలో ఈ నెల 8వ తేదీ వరకు ప్రతి రోజూ జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని ఆమె సూచించారు. పూర్తి వివరాలకు సెల్: 83176 94442 నంబర్ లో సంప్రదించాలని కోరారు.

## మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

**శాంతిపురం- సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు అందిస్తున్న సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పాల్గొన్నారు. మండల పరిధిలోని శివరాంపురం పంచాయతీలో కొలమడుగు, వేటగిరి కొత్తూరు, సిద్ధారెడ్లపల్లి, గ్రామాలలో సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శ్యామలమణి, టిడిపి నేతలు ఆనంద్ రెడ్డి మాజీ ఎంపిటిసి భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.





## లింగ వివక్షకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### - లింగ సమానత్వం పై అవగాహన

**వేంపల్లె -సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** లింగ వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపిఎం) వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సమైక్య అసిస్టెంట్లకు లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేంపల్లి ఎస్సై తిరుపాల్ నాయక్ హాజరై మాట్లాడారు. శక్తి యాప్, ఆన్ లైన్ మోసాలు, 1930, చైల్డ్ లైన్ 1098, మహిళలు మరియు పిల్లలు వేధింపులకు 1091 నంబర్లకు సంబంధించి ఫోన్ చేసినచో తక్షణమే రక్షణ కల్పిస్తామని తెలిపారు. మహిళల భద్రతపై ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. లింగ సమానత్వమును ప్రోత్సహించడమే జెండర్ కాంపెయిన్ యొక్క ముఖ్య ఉద్దేశం ఉన్నారు. అంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వర్ణలత మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ద్వారా లబ్ధి పొందాలని తెలియజేశారు. లింగ సమానత్వం మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు, నాయకత్వం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ రామలింగయ్య, సీసీలు అనిల్, బాబు, జయలక్ష్మి, సదాశివుడు, రెడ్డయ్య, అకౌంటెంట్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభం

### - 41 రోజులపాటు నిరంతరం అన్నదానం



**కనేకల్లు-సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** కనేకల్లు మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే అన్నదాన కార్యక్ర మాన్ని ఈ ఏడాదికూడా భక్తిపూర్వకంగా ప్రారంభించారు. డిసెంబర్ ఒకటవ తేదీన సోమవారం, ఆలయ అధ్యక్షులు నాగభూషణం, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు అన్నదాన సమితి ప్రధాన కార్యదర్శి రాపా ప్రకాష్ తెలిపారు. ఉదయం స్వామివారికి గంగపూజ, పంచామృతాభిషేకం, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం అవ్వ తిమ్మప్ప గురుస్వామి, నాగప్ప గురుస్వామి రూ. 10,116/- చందాగా అందజేసి శాశ్వత దాతలుగా నిలిచారు. ఇతర జిల్లాల నుండి కనేకలకు విచ్చేసే ఏ మాల వేసిన దీక్షాపరుల సౌకర్యార్థం, కనేకల్లు చెరువు కట్ట వద్ద ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నేటి నుండి వచ్చే 41 రోజుల పాటు ప్రతిరోజూ మధ్యాహ్నం 12:30 గంటలకు నిత్య అన్నదానం నిర్వహించనున్నట్టు సమితి ప్రకటించింది. భక్తులు, ఆనందసేవకులు ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వందలాదిమంది స్వాములు పాల్గొనగా, ఆలయ అధ్యక్షులు నాగభూషణం, సుబ్రహ్మణ్యం, అన్నదాన సమితి ట్రెజరర్, ఎల్ఐసి ఉపాధ్యక్షులు, జయరాం, నరసింహులు, మల్లికార్జున, గోపాల్, శివ మాస్టర్, హెూటల్ శివ, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో బంగారు పతకాన్ని సాధించి అనూషకు

### 10000 ఆర్థిక సాయం చేసిన బిజెపి నాయకులు



**పామిడి -సూర్య వాస్తవం :** పామిడి మోడల్ స్కూల్‌లో 8 వ తరగతి చదువుతోన్న పామిడి పట్టణానికి చెందిన రోజు వారి కూలీలైన కృష్ణ అనిత దంపతుల కుమార్తె కుమారి అనూష ఇటీవలే విజయవాడ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలలో బంగారు పతకాన్ని సాధించి రేపటి నెలలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో జరగబోవుతున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన తరుణంలో "ప్రతిభకు పేదరికం అడ్డు కారాదు" అని భావించి బీజేపీ యువనేత రాజశేఖర్ గౌడ్ నేడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీయువమోర్చా రాష్ట్ర కార్యదర్శి అజేష్ యాదవ్ చేతుల మీదుగా అనూషకు 10000/- ఆర్థిక సాయం అందించడం జరిగింది. మున్ముందు ఇదే ఒరవడితో శ్రమించి తల్లితండ్రులకు పుట్టిన ఊరికి. మంచి పేరు తీసుకురావాలని అనూషకు సూచించారు.



## నేను సైతం పోస్టర్లు ఆవిష్కరణ

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, డిసెంబర్1:** మహిళలపై హింస వ్యతిరేక అంతర్జాతీయ పక్షోత్సవాల నేపథ్యంలో మహిళలు, బాలికలపై జరిగే హింసను ఆపడానికి నేను సైతం అని సమాజంలోని అన్ని వర్గాల వారిని భాగ స్వాములు చేసి ఒక మంచి మార్పు కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా నేటి సోమవారం అనంతపురం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సెల్ఫీ బూత్, సైన్ బోర్డు ఏర్పాటు చేయగా, జిల్లా కలెక్టర్ ఆనంద్ గోడ పత్రికలను ఆవిష్కరించారు. జేసి శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, డీవీసీ, ఐసీపీఎస్, చిల్డ్రన్ హోం అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్, పలువురు అధికారులు సంఘీభావంగా సెల్ఫీలు దిగి, సిగ్నేచర్ క్యాంపెయిన్ బోర్డుపై తమ సంతకాలు చేశారు. చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్ ఖాజీ రఫీమున్నీసా, డీవీసీ అధికారులు ఉమాదేవి, నర్మద, గీత, సఖీ మేనేజర్ శాంతామణి, సిబ్బంది మంజుల, దుర్గా, రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి, ఇస్నిప్ షాహిన పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధి లేని సమాజాన్ని నిర్మిద్దాం

### - జనసేన నేత డా. దాసరి రవిశంకర్



**వేంపల్లి -సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** ఎయిడ్స్ వ్యాధి లేని సమాజాన్ని నిర్మిద్దామని జనసేన నేత డాక్టర్ దాసరి రవిశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన వారికి ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలకు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు సగం మందికి పైగా యువతి, యువకులే ఉన్నారని,భారత దేశంలో సుమారు 50 లక్షలకు పైగా హెచ్ఐవి వైరస్ సోకిన వాళ్ళు ఉన్నారని, వీటికి వ్యతిరేకంగా పోరాడుటం. ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యమని డాక్టర్ దాసరి రవిశంకర్ తెలిపారు.

## ప్రతిభ పోటీల్లో మెరిసిన రవితేజ కాన్సెప్ట్ హైస్కూల్ విద్యార్థులు



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** గత నెల 29, 30 తేదీలలో బాల దినోత్సవం 3.0 సందర్భంగా కడపలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పోటీ పరీక్షలలో పులివెందులకు చెందిన రవితేజ కాన్సెప్ట్ హై స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు.

ఈ నేపథ్యంలో వేస్ట్ ఫ్రమ్ బెస్ట్ అనే అంశంపై ప్రాజెక్టు తయారీ పోటీల్లో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భవ్య శ్రీ రెడ్డి విద్యార్థిని అత్యంత ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే రైమ్స్ అనే అంశంపై ఆంగ్లంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో మూడో తరగతి చదువుతున్న హేమ వదన అనే విద్యార్థిని ప్రతిభ చూపి మూడవ స్థానంలో నిలిచింది. తెలుగులో వ్యాసరచన పోటీల్లో 8వ తరగతి చదువుతున్న ముస్కాన్ అనే విద్యార్థి ప్రతిభ చూపి మూడవ స్థానం, తెలుగులో డిక్టేషన్ పోటీ విభాగంలో 9వ తరగతి చదువుతున్న గంగా శ్రీనిధి విద్యార్థి ప్రతిభ చూపి కన్సిలైజ్ కన్సిలేషన్ ప్రైజ్ దక్కించుకుంది. ఈ మేరకు ప్రతిభ చూపిన ఆ విద్యార్థులు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఇందుకు ఆ పాఠశాల కరస్పాండెంట్ జనార్దన్ రెడ్డి ప్రధానోపాధ్యాయుడు రహమతుల్లా ఆ విద్యార్థులను అభినం దించారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల జయభేరి



**కదిరి-సూర్య వాస్తవం, డిసెంబరు 1:** జాతీయస్థాయి కరాటే పోటీలలో ఆదివారం కర్ణాటక చిక్కబల్లాపూర్ జిల్లా గౌరీ బిదునూరులో ఆర్గనైజర్ చంద్రశేఖర్ ఫస్ట్ గ్రేడ్ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థులు కటాస్ విభాగంలో 11 మంది పాల్గొని విజయం సాధించారు వారిలో అసద్. హానిక రాయల్. భవ్య శ్రీ. గిరీష్ రాయల్. భవ్య. లక్ష్మీ ప్రసన్న. మొదటి స్థానం సాధించగా. ప్రాక్షీ. ధనశ్రీ. జస్వంత్. జతిన్ కౌశిక్ రాయల్ రెండవ స్థానాన్ని సాధించారు అలాగే హిమానిక మూడవ స్థానాన్ని సాధించింది ఈ సందర్భంగా ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ మాస్టర్ అక్బర్ అలీ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థిని విద్యార్థులకు క్రీడల్లో రాణించాలని ముఖ్యంగా కరాటే లో విద్యార్థులు చురుగ్గా పాల్గొని ఆత్మ రక్షణకు ఉపయోగపడే కళలని నేర్చుకోవాలని పిలుపునిచ్చారు జాతీయస్థాయి కరాటేలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు మాస్టర్ అక్బర్ అలీని అభినందించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా , తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

### కాలర్ ఎగరేసే పేరుమోసిన

# రౌడీ షీటర్లును నగర వీధుల్లో ఊరేగింపు

- ఇకపై మళ్ళీ నేరాలు చేస్తే ఖబడ్దార్
- నెల్లూరు జిల్లా చరిత్రలో గుర్తుండి పోయే దినం
- నేరగాళ్ళు, రౌడీలు, గూండాల గుండెల్లో గుబులు
- జిల్లా ఎస్పీ అజిత పై జిల్లా వ్యాప్తంగా ప్రశంసల వర్షం





**నెల్లూరు -సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** నెల్లూరు నగరంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. నెల్లూరు నగరవ వ్యాప్తంగా ఉన్న పోలీసు సర్కిల్స్ లో పదే పదే నేరాలు చేస్తూ పోలీసులకు, ప్రజలకు తలనొప్పిగా మారిన సుమారు 50 మంది రౌడీషీటర్లను, నగర వీధుల్లో బహి రంగంగా నడిపించారు. గత కొన్ని నెలలుగా నెల్లూరు నగరంలో వరుస హత్యలు నేరాలు జరుగుతుండడం, కొన్ని సందర్భాల్లో నేరగాళ్లు ఏకంగా పోలీసులపైనే హత్యాయత్నాలకు పాల్పడడంతో పోలీసులు సీరియస్ అయ్యారు. నెల్లూరు జిల్లా లో నేరాలు అరికట్టేందుకు గట్టిగా చర్యలు చేపడుతున్న జిల్లా ఎస్పీ అజిత మరో అడుగు ముందుకు వేశారు.ఈ నేపథ్యంలో ముఖ్యంగా నెల్లూరు నగరంలో రౌడీ షీటర్లుగా ఉంటూ పదేపదే నేరాలకు పాల్పడుతున్న కొందరిని గుర్తించి వారిని నగరం నడిబొడ్డున ఉన్న విఆర్సి సెంటర్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ప్రధాన రహదారిలో నడిపిస్తూ ఇంకెవరైనా తప్పులు చేయాలన్న నేరగాళ్ల పక్కన నిలబడాలన్న అసహ్యించుకునేలా లేదా భయపడేలా రౌడీ షీటర్ల ను, నగర వీధుల్లో నడిపించారు.పోలీసు యాక్షన్ లో ఇది కేవలం ఒక శాంపిల్ మాత్రమేనని ఇక మీదట ఎవరైనా నెల్లూరు నగరంలో నేరాలు చేయాలన్న కత్తి పట్టాలన్న ఒకటికి పది సార్లు ఆలోచించుకునేలా నేరగాళ్లపై, ఉక్కు పాదం మోపేలా పోలీసు చర్యలు ఉండబోతున్నాయని సంకేతాలు తెలియచేశారు.

ఒకటవ, ఐదవ,ఆరవ పట్టణ పోలీస్ స్టేషన్స్ లలోని యాక్టీవ్‌గా రిపీటెడ్‌గా నేరాలు చేస్తున్న సుమారు 45 మందికి పైగా నేరగాళ్ల ను నడిపి ంచిన ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ సీఐ కోటే శ్వరరావు, ఐదో పట్టణ సీఐ వెంకటేశ్వరరావు,ఆరో పట్టణ సీఐ సాంబశివరావు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు

### - జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



**శ్రీ సత్యసాయిబ్యూరో -సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లను మంజూరు చేస్తానని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు.సోమవారం కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామంలో... ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు కలెక్టర్ స్వయంగా పింఛను పంపిణీ చేశారు.గ్రామంలోని సి.వెంకట రామిరెడ్డి, కురబ గంగన్న, వై లింగారెడ్డి, అశ్వర్తమ్మ లకు స్వయంగా పింఛను లబ్దిని అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛను సక్రమంగా అందుతుందా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా, పింఛను పంపిణీ నిమిత్తం వచ్చిన వారి ప్రవర్తన ఎలా ఉంది, గౌరవంగా మాట్లాడుతున్నారా లేదా అని లబ్ధిదారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు .ప్రతినెల 1వ తేదీననే ఉదయం పింఛన్లను అందజేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మరియు జిల్లా కలెక్టరుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామంలో ఎన్ని పింఛన్లు ఉన్నాయి, ఇప్పటివరకు ఎంతమందికి పంపిణీ చేశారు.. అన్న వివరాలను అధికారులు అడిగి తెలుసుకుని... మొత్తం నూరు శాతం పింఛన్లను పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వివిధ అంశాలపై తగు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏపీడీ నరసయ్య, ఎంపీడీవో ఏ నటరాజ్, సర్పంచ్ కురబ రవికుమార్, పంచాయతీ సెక్రటరీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములు ఆక్రమించిన

## వారిపై చర్యలు తీసుకోవాలి

### - సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం డిసెంబర్ 1:**లక్కిరెడ్డిపల్లి మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రాయచోటి నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి సిద్దిగాళ్ల అన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లి తాసిల్దార్ క్రాంతి కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి మండల పరిధిలో ఉన్న వివిధ ప్రభుత్వ భూములు పోరంబోకు, చెరువు కట్టలు, శివారు భూములు, రహదారి పక్క భూములు కొన్ని అక్రమంగా కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ఆస్తులను కాపాడి ప్రజా ప్రయోజనాలను రక్షించడం అత్యవసర అవసరం అని అక్రమ నిర్మాణాలు సాగు ప్రయత్నాలు లేదా కబ్జా చర్యలు నివారించేందుకు సంబంధిత ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలకు,ఆక్రమణలకు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రజల్లో అవగాహన పెరిగి, భవిష్యత్తులో అక్రమాలు నివారించవచ్చు అని తెలిపారు.కావున మండల పరిధిలోని ముఖ్యమైన ప్రభుత్వ భూములన్నింటిపై తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అవసరమైతే సంబంధిత రికార్డుల పునర్మూల్యాంకనం చేసి, భూమి సరిహద్దులు కూడా స్పష్టంగా గుర్తించి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కొమ్ము ఓబులేసు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టురట్టు

### -"డిజిటల్ అరెస్ట్" పేరుతో 48 లక్షలు దోచుకున్న ముగ్గురు అరెస్ట్







**మదనపల్లి -సూర్య వాస్తవం :** మదనపల్లి కేంద్రంగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ నేర ముఠాను మదనపల్లి 1-టౌన్ పోలీసులు బట్టబయలు చేశారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సోమవారం రాయచోటిలో మీడియాకు వెల్లడించారు. మదనపల్లెకు చెందిన 75 ఏళ్ల రిటైర్డ్ నర్సు రేపురి బెంజిమెన్‌ను లక్ష్యంగా చేసుకున్న నిందితులు, సీబీఐ/ఈడీ అధికారులమంటూ బెదిరించి, "మీ మీద కేసు ఉంది" అంటూ భయపెట్టారు. "డిజిటల్ అరెస్ట్" పేరుతో వీడియో కాల్‌లో ఉంచి, రూ.48 లక్షలు బదిలీ చేయించుకున్నారు. రాయచోటిలో జరిగిన ప్రత్యేక ఆపరేషన్‌లో నిందితులు పటాన్ ఇంథియాజ్ ఖాన్, షేక్ అమీన్, షేక్ అర్షాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.32 లక్షల నగదు, 25 ఏటీఎం కార్డులు, మొబైళ్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకోగా, ఖాతాల్లో ఉన్న రూ.7.65 లక్షలను ఫ్రీజ్ చేశారు. ఈ ముఠా కాంబోడియా కువైట్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన డీఎస్పీ మహేంద్ర, సీఐ మహమ్మద్ రఫీ, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ప్రజలకు ఎస్పీ హెచ్చరిక

"డిజిటల్ అరెస్ట్ అంటూ చట్టంలో ఏం లేదు. ఎవరూ వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. ఏ దర్యాప్తు సంస్థ ఆన్‌లైన్‌లో డబ్బులు అడగదు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి. అనుమానం వచ్చిన వెంటనే 1930 కు కాల్ చేయాలి" అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచించారు. సైబర్ మోసాలపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లను కూడా జిల్లా ఎస్పీ ధీరజ్ ఆవిష్కరించారు.

## వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం, డిసెంబర్ 1 :**ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలిలో వాహనాలను సోమవారం ఎస్సై రవీంద్రబాబు ట్రైనీ ఎస్ఐ సుస్మిత ఏఎస్ఐ మస్తాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాటాడుతూ... గతంలో కాగితాలు లేక పట్టుబడిన ద్విచక్ర వాహనదారులు జరిమాన చెల్లించకుండా తిరిగే వాటిని మళ్లీ తిరిగి జరిమానా చెల్లించేటట్టు చూస్తున్నామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్ వేసుకొని వెళ్లడం అతివేగం వేగంగా వెళ్లడం చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్స్ తో పాటు అన్ని అర్హత కాగితాలు కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధిస్తామన్నారు. చిన్న పిల్లలు వాహనాలు నడిపిన తల్లిదండ్రులపై చర్యలు తప్పవని అన్నారు ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ భరోసా పెంఛన్ల పంపిణీ



**కదిరి –సూర్య వాస్తవం, డిసెంబర్ 1 :**కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశానుసారం, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ప్రతిష్టాత్మకంగా ఇచ్చిన మాట ప్రకారం గెలిచిన వెంటనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ. 4000, 6,000, 15,000, అర్హులైన లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాన్ని అందించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియ జేస్తూ, కదిరి మున్సిపాలిటీలోని 36 వార్డులకు గాను 9307 మంది లబ్ధి దారులకు 4 కోట్ల, 9 లక్షల, 81 వేల,500 రూపాయలు అందజేయడం జరుగు తుందని, ఈరోజు కదిరి మున్సిపాలిటీకి చెందిన 17వ వార్డులోని రామిరెడ్డి కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వితంతువులు, వికలాంగులు, వృద్ధులకు, 322 మంది లబ్ధిదారులకు 14 లక్షల 26 వేల రూపాయలు పెన్షన్ వారి ఇంటింటికి తిరిగి అందజేసిన మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కె ఎస్ దిశాదున్నిసా బహావుద్దీన్, స్థానిక వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి సావిత్రమ్మ, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, సచివాలయ సిబ్బంది, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు,14 వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, తెలుగుదేశం పార్టీ 17 వ వార్డు ఇంచార్జ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కనేకల్ జూనియర్ కళాశాలలో
## ఎయిడ్స్ అవగాహనా ర్యాలీ




**కనేకల్–సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కనేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళా శాల ప్రిన్సిపాల్ఈ.ఆంజనేయులు నాయ కత్వం వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డీకే. రవికుమార్, వైద్య సిబ్బంది, అధ్యాపకులు, అధ్యాపకేతర ఉద్యోగులు కూడా పాల్గొని ఎయిడ్స్ విషయంలో ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు, విద్యార్థినులు బ్యానర్లు చేతుల్లోపట్టుకొని, నినాదాలతో ప్రజల్లో అవగాహన కలిగించేలా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులలో సాగిన ఈ ర్యాలీకి ప్రజలు మంచి స్పందన ఇచ్చారు. ఎయిడ్స్ నివారణ, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యత, అపోహలను తొలగించడం వంటి విషయాలను విద్యార్థులు స్లోగన్ల రూపంలో ప్రచారం చేశారు.కార్యక్రమం ముగింపు సందర్భంగా వైద్య సిబ్బంది ఎయిడ్స్ నివారణ, చికిత్సా అవకాశాలు, పూర్తి సమాచారం ప్రజలకు అందించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే విధంగా ఈ ర్యాలీ ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## ఎన్టీఆర్ భరోసా
## సామాజిక పింఛన్ల పంపిణీ

**- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, డిసెంబర్ 01:** అన్నమయ్య జిల్లా కలకడ మండలం బాట వారి పల్లి లో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే వేలిముద్ర తీసుకుని నగదును లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతుల పింఛను వితంతు పింఛన్ మరియు వృద్ధాప్య పింఛన్ల పంపిణీ స్వయంగా పరిశీలించారు. అనంతరం లబ్ధి దారులతో మాట్లాడుతూ ఇంటి వద్దనే పెన్షన్ అందుతుందా, ఏ రోజు పింఛను అందుతోంది, ఎన్ని గంటల సమయంలో అందుతుంది, వంటి ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు.



# జిల్లా కేంద్రం కొనసాగింపులో మంత్రి మండిపల్లి విశేష కృషి

**- మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం**



**లక్కిరెడ్డిపల్లి –సూర్య వాస్తవం, డిసెంబర్ 1 :**అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కొనసాగింపులో రాష్ట్ర రవాణా మరియు క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విశేషంగా కృషి చేశారనిఆంధ్రప్రదేశ్ అటవీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగొల్ల రెడ్డయ్య డిసిసిబి మాజీ డైరెక్టర్ పోలురెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు.సోమవారం లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలో మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కొనసాగింపులో మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి విశేషంగా కృషి చేశారని అందుకు ఫలితమే నేడు రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగుతుందని అన్నమయ్య జిల్లా కేంద్రం రాజంపేటకు మార్చబడుతుందని కొందరు పనిగట్టుకునిప్రచారం చేశారని రాజంపేట జిల్లా కేంద్రంగా మార్చితే దాదాపు రాజంపేటకు 60 ,70 కిలోమీటర్లు రెండు ఘాట్ కొండలలో ప్రయాణించాల్సి వస్తుందని రాయచోటి ప్రాంత ప్రజల్లో భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో రాయచోటి ప్రాంత ప్రజలకు జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగుతుందని మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజలకు అభయమిచ్చారని,భౌగోళికంగా రాయచోటి జిల్లా కేంద్రంగా ఉండడానికి అన్ని అర్హతలు ఉన్నాయని మంత్రి ఆనాడే కరాకండిగా చెప్పారని ఎటువంటి పరిస్థితుల్లోరాయచోటి జిల్లా కేంద్రంగా మార్చబడదని మంత్రి మండిపల్లి చెప్పారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్, మాజీ మండల అధ్యక్షులు తిమ్మిరెడ్డి ఉమాపతి రెడ్డి, అన్నమయ్య జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు భాస్కర్, తెలుగుదేశం పార్టీ నాయకులు చీరల సుధాకర్ యాదవ్, లక్కిరడ్డిపల్లి మండల మైనార్టీ నాయకులు ఆరిపుల్లా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, జై చంద్రారెడ్డి (జే కే),సాదుల్ల,షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ సమస్యలను
# నాణ్యతగా పరిష్కరించడమే లక్ష్యం

**-అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు**
**-జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్**



**శ్రీ సత్య సాయి బ్యూరో –సూర్య వాస్తవం, డిసెంబరు 1:** పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన ప్రజా సమస్యలను నాణ్యతగా పరిష్కరించడమే లక్ష్యం. అర్జీలను సంతృప్త స్థాయిలో సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో.. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జేసి ఎం మౌర్య భరద్వాజ్, డిఆర్వో సూర్య నారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్–ఎల్ఏ, రీఓ పెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరి ంచాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు. నల్లమాడ మండలం గోపిపల్లి కిచెందిన శ్రీఆర్. ప్రసాద్.. 20 సంవత్సరాలు నుంచి మామిడి చెట్లు సాగు చేసుకుంటున్నాను. పరిశీలించి విచారణ చేసి పట్టా మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామానికి చెందిన పి వెంకటేష్.. తాను సాగు చేసుకుంటున్న 3.46 ఎకరాల భూమి గ్రామంలో వేరే అతను తన భూమిగా చెబుతున్నాడని.. విచారణ చేసి న్యాయం చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.ఈ రోజు కార్యక్రమంలో మొత్తం 244 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

## వైద్య బృందం
## అందిస్తున్న సేవలు ప్రశంసనీయం

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**
**- ఉచిత శస్త్రచికిత్స శిబిరాన్ని సందర్శించిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**







**అన్నమయ్య బ్యూరో /కర్ణాటక- సూర్యవాస్తవం, డిసెంబర్01:** ఆదిచుంచనగిరి మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ (ఎయిమ్స్ సెండ్ ఆర్ సి,) బీ.జీ. నాగరలో రోటాప్లాస్ట్ ఇంటర్నేషనల్ (యూఎస్ఏ) రొటరీ బెంగళూరు నార్త్, ఎయిమ్స్ అండ్ ఆర్ సి ప్లాస్టిక్ రీకన్స్ట్రక్టివ్ సర్జరీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత పునర్నిర్మాణ శస్త్రచికిత్స శిబిరం–2025ను రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నేడు ముఖ్య అతిథిగా పాల్గొని సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి శస్త్రచికిత్స కోసం వచ్చిన చిన్నారులు, మహిళలు, రోగుల కుటుంబాలతో మాట్లాడి వారి ఆరోగ్యపరమైన పరిస్థితులను ఆరా తీశారు. వైద్య బృందం అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, ఇలా అన్నారు. రోటాప్లాస్ట్ అంతర్జాతీయ నిపుణులు, రోటరీ సంస్థ మరియు ఎయిమ్స్ అండ్ ఆర్ సి వైద్య బృందం చేస్తున్న ఈ సేవ వేలాది కుటుంబాలకు కొత్త జీవితం ఇస్తోందనీ,ప్రభుత్వం ద్వారా ఇటువంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తాం అని మంత్రి పేర్కొన్నారు. శిబిరంలో చీలిన పెదవి, చీలిన వాలు ,కాలిన గాయాల వల్ల వచ్చే వారికి సంబంధించిన శస్త్రచికిత్సలు పూర్తిగా ఉచితంగా అందించబడుతున్నాయాని,అంతర్జాతీయ, జాతీయ నిపుణుల బృందం 29 నవంబర్ నుండి 14 డిసెంబర్ 2025 వరకు రోగుల సేవలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. మంత్రి తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, రోటరీ సభ్యులు కూడా పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ ఆర్‌జీ కేటిలో
## క్వాంటం కంప్యూటర్‌పై వర్క్‌షాప్



**వేంపల్లి –సూర్య వాసవం ,డిసెంబర్ 1:** ట్రిబుల్ ఐటీ ఆర్కే వ్యాలీ ఇడుపుల పాయలో క్వాంటం కంప్యూటర్ వర్క్ షాప్ కార్యక్రమం ఆరు రోజులు పాటు జరిగినట్లు ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ కుమార్ గుప్తా తెలియజేశారు ప్రస్తుతం మారు తున్న టెక్నాలజీ రంగంలో మరిన్ని శిక్షణ సదస్సులు జరగాలన్న ఉద్దేశంతో భారత ప్రభుత్వం ఏర్పాటుచేసిన నేషనల్భారత ప్రభుత్వం ఏర్పాటుచేసిన నేషనల్ వాంటెడ్ మిషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న అమరావతి క్వాంటం వ్యాలీ తదితర భాగాలలో మరిన్ని క్వాంటం ఉద్యోగాలను తెచ్చుకోవడం కోసం ఆర్కే వ్యాలీ క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగింది ఈ క్వాంటం ఇనో వేషన్స్ సెంటర్ తరపున 6 రోజుల క్వాంటం కంప్యూటర్ వర్క్ షాప్ జరుగుతుంది ఈ క్వాంటం కంప్యూటర్ వర్క్ షాపునకు ఐబీఎం సైంటిస్టు చీప్ టెక్నికల్ ఆఫీసర్స్ (సిటిఓ ) డేటా టీచ్ మరియు సి..–డి ఎ సి నుండి స్పెషలిస్టులు ట్రిబుల్ ఐటీ ఆర్కే వ్యాలీకు విచ్చేసి విద్యార్థులకు పాఠం టెక్నాలజీలో క్వాంటం కంప్యూటర్ వర్క్ షాప్‌లో శిక్షణను కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంనకు ఇప్పటివరకు 150 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుకోసం కళాశాల విద్యార్థులకు అధ్యాపకులకు అవకాశం ఇవ్వడం జరిగింది ఈ ఆరు రోజులకు సంబంధించినవి వర్క్ షాప్ నాకు బ్రోచర్ను డైరెక్టర్ మరియు పరిపాలన అధికారి పి రవికుమార్ విడుదల చేశారు ఈ ప్రోగ్రామ్‌కు ఆర్గనైజర్‌గా డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ సుధాకర్ రెడ్డి అలాగే అశోక్ కుమార్ రెడ్డి భాస్కరయ్య కార్తీక్ కుమార్ రెడ్డి వ్యవహరించడం జరిగింది.



## ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ బహూకరణ

**- యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం**



**తనకల్లు - సూర్య వాస్తవం,డిసెంబర్ 1 :** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కదిరి సిమ్స్ హాస్పిటల్ ఎండిబి నిసార్ యాసిన్ ఖాన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నల్లగుట్లపల్లి ,ఈతోడు, గవర్నమెంట్ హై స్కూల్ తనకల్లు పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తయారు చేసిన ఎస్ఎస్సి మాదిరి ప్రశ్న పత్రాల పుస్తకాలను ఉచితముగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిగ్రపు శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకొని కలలు కని వాటిని సాకారం చేసుకొని మంచి స్థాయి చేరాలని దాతకు చిన్న వయసులోనే ఏ విధంగా చేయడం మంచి భవిష్యత్తుకు పునాది అని అభినందించారు.నిసార్ యాసిన్ ఖాన్ మాట్లాడుతూ ఈ అభివృద్ధి చెందుతున్న కాలంలో టెక్నాలజీ మరియు స్కిల్స్ నీ పెంపొందించుకోవాలన్నినాన్ని ముందు తరం వరకు దాచి పెట్టుకోవాలని ఈ ్ఞానాన్ని ఉపయోగించికొని పై స్థాయికి చేరాలని చెప్పారు .ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నూర్ తాహెర్ వలి, జిల్లా ఆడిట్ కమిటీ



సభ్యులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ యూటీఎఫ్ సంఘ సిద్ధాంతాలు అయిన హక్కులు బాధ్యతలు సామాజిక స్పృహలో భాగంగా గత 27 సంవత్సరాల నుండి ఈ పుస్తకాలను తయారు చేస్తున్నదని విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ పుస్తకంలో ఒక్కో సబ్జెక్టు సంబంధించి నాలుగు ప్రశ పత్రాలు మరియు వాటికి సమాధానాలు అనుభవం గల ఉపాధ్యాయుల చే రచించడం జరిగినదని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కాజా మొహిద్దీన్ గణేష్, శివశంకర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి ఉపాధ్యాయులు, ,అరుణ, ఉస్మాన్ , నరేంద్ర ప్రసాద్, భాస్కర్, యుగంధర్ రెడ్డి, నాగార్జున, జనార్దన్ రెడ్డి, హరేంద్ర ప్రసాద్ అక్కడ విద్యార్థులు పాల్గొన్నారు.

# హెచ్ఐవిపై యువత అప్రమత్తంగా ఉండాలి

**-హెచ్ఐవి అవగాహన ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్**

**శ్రీ సత్యసాయిబ్యూరో -సూర్య వాస్తవం, డిసెంబర్ 1:** హెచ్ఐవి పై యువత అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం భారీ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మరియు పోలీసు సూపరిండెంట్ సతీష్ కుమార్ , పురపాలక చైర్మన్ ఓబులపతి సంయుక్తంగా పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ నగరంలోని సత్యమ్మ దేవాలయం నుంచి ప్రారంభమై ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మానవహారం మరియు ప్రతిజ్ఞతో ముగిసింది.ఈ ర్యాలీలో అధికారులు,అనధికారులు స్వచ్ఛంద సంస్థలు కాలేజీ విద్యార్థులు విద్యార్థులు పుర ప్రజలు దాదాపు 2వేల మంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ... యువత హెచ్ఐవి మీద అప్రమత్తంగా ఉండాలని, హెచ్ఐవి పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... హెచ్ఐవి కలిగిన వ్యక్తులని ఆదరించాలని మనలో ఒకరిగా చూడాలని తెలియజేశారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఫైరోజా బేగం మాట్లా డుతూ... జిల్లాలో హెచ్ఐవి పై పాఠశాలలు, కళా శాలలో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కలిగించి నందుకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థాయి అవార్డు వచ్చిందని మొత్తం ఏడు రాష్ట్రస్థాయి అవార్డులు ఉమ్మడి అనంతపురం జిల్లాకు వచ్చాయని తెలియజేశారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిని డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ గత ఐదు



సంవత్సరాలుగా హెచ్ఐవి తగ్గుముఖం పడుతోందని దీనికి వైద్య ఆరోగ్యశాఖ మరియు ఇతర స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం వల్ల ఇది సాధ్యమైందని తెలియజేశారు.ఈ ర్యాలీలో ఆర్డిఓ సువర్ణ, మున్సిపల్ కమిషనర్, డి సి హెచ్ ఎస్ డాక్టర్ మధుసూదన్, జిల్లా సూపర్వైజర్ జి వి రమణ, మిస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ ఈవీ రమణ,జిల్లా ఇమ్మైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డిపిఎంఓ డాక్టర్ నాగేంద్ర నాయక్, ఆర్ బి ఎస్ కే నోడల్ ఆఫీసర్ సునీల్ కుమార్, డెమో రామలక్ష్మి,అనంత నెట్వర్క్ రామాంజనేయులు,వారి సిబ్బంది, జన జాగృతి పెనుగొండ ఆంజనేయులు వారి సిబ్బంది, శక్తి మైత్రి మహిళా మహిళా మండలి నవీన్ కుమార్ మరియు వాళ్ళ సిబ్బంది, జన జాగృతి కదిరి సిబ్బంది, ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, లింక్ వర్కర్స్ వెంకట్ మరియు వారి సిబ్బంది, వి ఎం ఎం సిబ్బంది,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, మంగళకర విద్యాసంస్థల విద్యార్థిని విద్యార్థులు, సాంస్కృతి విద్యాసంస్థల విద్యార్థిని విద్యార్థులు, శ్రీ విజ్ఞాన్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బుక్కపట్నం విద్యార్థిలు, పత్తి ఐటిఐ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, శ్రీ సత్య సాయి హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, బీడుపల్లి హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, చిన్నంపల్లి హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, ఎన్ ఎన్ సి సి ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, పుట్టపర్తి బుక్కపట్నం కొత్తచెరువు వైద్య సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది మొదలగువారు పాల్గొన్నారు.ఈ ర్యాలీ అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశం మందిరంలో హెచ్ఐవి పై జిల్లాలో ఉత్తమ సేవలందిస్తున్న ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థలకు ప్రశంస పత్రాలు, మెమొంటోలు అందజేశారు. దాతల సహాయంతో సేకరించిన పౌష్టికాహారాన్ని డిఎంహెచ్వో చేతుల మీదుగా చిన్నారులకు దాదాపు 30 మందికి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఐవి పై వివక్షను రూపుమాపడానికి హెచ్ఐవి కలిగిన పిల్లలు పెద్దలతో జిల్లా అధికారులు సహపంక్తి భోజనము చేశారు. ఈ సహపంతి భోజన కార్యక్రమంలో డిఎంహెచ్వో, డిసిహెచ్ఎస్, జిల్లా ఎడిషన్ నియంత్రణ అధికారిని, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు అనంత నెట్వర్క్ రామాంజనేయులు, ఇతర వచ్చిన సంస్థలు పాల్గొన్నారు.



## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# సైబర్ సెక్యూరిటీ అండ్ అప్లికేషన్స్ అంశంపై వర్క్ షాప్

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, నవంబర్ 01:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నాడు "సైబర్ సెక్యూరిటీ, అప్లికేషన్స్" అనే అంశంపై ఆరు రోజుల వర్క్ షాప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్గా అమిత్ కుమార్, సీఈవో, సావరి మైండ్స్, న్యూఢిల్లీ హాజరై విద్యార్థులకు విలువైన విషయాలను వివరించారు. సదస్సులో మాట్లాడిన అమిత్ కుమార్ నేటి డిజిటల్ ప్రపంచంలో బ్యాంకింగ్, ఈ కామర్స్, డేటాబేస్ సంస్థలు తరచుగా హ్యాకింగ్ దాడులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ దాడుల కారణంగా విలువైన డేటా, ఆర్థిక నష్టం చోటుచేసుకుంటుందని తెలిపారు. నెట్వర్క్ హ్యాకింగ్, అప్లికేషన్ హ్యాకింగ్, ఇంజనీరింగ్ హ్యాకింగ్ వంటి దాడులను ఎదుర్కోవడానికి సైబర్ సెక్యూరిటీ ఒక శక్తివంతమైన రక్షణ కవచమని ఆయన విశదీకరించారు. అలాగే ప్రతి డిజిటల్ సంస్థలో అడ్మినిస్ట్రేటివ్ విభాగం హ్యాకింగ్కు గురికాకుండా ఉండేందుకు సైబర్ సెక్యూరిటీ



తప్పనిసరి అవుతుందని, ఈ రంగంలో దేశవ్యాప్తంగా 50 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూప్రస్తుతం యూనివర్సిటీలు అప్లికేషన్ ఆధారిత ప్రయోగ పాఠాలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులు కళాశాలలోనే టెక్నికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయని చెప్పారు. మార్కులు మాత్రమే ప్రామాణికం కాదని, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు టెక్నికల్ స్కిల్స్లో దృఢత సాధించాలి అని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులుసైబర్ సెక్యూరిటీపై వివిధ సందేహాలను అడిగి నివృత్తి చేసు కున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వానికి

# ప్రజా సంక్షేమమే ముఖ్యం

**- లక్కిరెడ్డిపల్లి టీడీపి మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్**





**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం ,డిసెంబర్ 1 :** కూటమి ప్రభుత్వానికి ప్రజాసంక్షేమ ముఖ్యమని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా లక్కిరెడ్డిపల్లి మండల టీడీపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ తెలిపారు.సోమవారం పందిళ్ళపల్లి గ్రామం, కస్పాలలో రాష్ట్ర రవాణా,యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సూచన మేరకు స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో పాల్గొని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్ పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ శంకరపు జయరాం, యాగంటి పాపయ్య,మూగి వెంకటరమణ, ఖాజావలి, అమ్మానుల్లా, తమ్మిశెట్టి వెంకట రమణ, సుబ్బారెడ్డి,వి రమణారెడ్డి, జై చంద్ర,బుడ్డ వెంకటరమణ, డీలర్ రామానుజల రెడ్డి, మండ్ల రామాం జనేయులు, సిద్దక వెంకట్రాంరెడ్డి,కావాలి ఆంజనేయులు, జనార్దన్ రెడ్డి,వెంకట్రాంరెడ్డి మండల మహిళా అధ్యక్షురాలు ఆదిమూలం పూజ,మంద సహదేవ టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం




**వేంపల్లి -సూర్య వాస్తవం, డిసెంబర్ 1 :** ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ క్యాంపస్లో నేడు ఎయిడ్స్ దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...ఎయిడ్స్ వ్యాధి హెచ్ఐవి (హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్) అనే వైరస్ వల్ల వస్తుంది. ఇది శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుంది, దీని వలన శరీరం అంటు వ్యాధులను ఎదుర్కోవడం కష్టమవుతుంది. ప్రస్తుతం ఎయిడ్స్కు నివారణ లేదు. నియంత్రణ ఒకటే మార్గం. కావున అసురక్షిత లైంగిక సంబంధాలకు దూరంగా ఉండటం, సూదులు, సిరంజిలను పంచుకోకపోవడం,వాచ్ఐవి సంక్ర ˘మణను నిరోధించడానికి మందులు వాడటం వంటివి. హెచ్ఐవి ఉన్నవారు, గర్భం దాల్చినవారు మందులు తీసుకోవడం ద్వారా శిశువుకు సంక్రమించడాన్ని నివారించవచ్చు. ఎయిడ్స్ను నివారించడానికి అవగాహన,అప్రమత్తత చాలా ముఖ్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ వి ఎస్ ఎస్ కుమారస్వామి గుప్తా పరిపాలనాధికారి డాక్టర్ రవికుమార్ డీన్ అకాడమిక్స్ రమేష్ కైలాస్ పరీక్షల విభాగపు అధికారి అరుణ్ కుమార్ రెడ్డి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె దీప్తి , ఇతర ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, పి ఆర్ ఓ తిరుపతి రెడ్డి అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులుఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ఎస్పై రవీంద్రబాబు వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి లు పేర్కొన్నారు.ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జూనియర్ కళాశాల నుండి మూడు రోడ్ల కూడలిలో వైద్యారోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులను వెలి వేయకుండా వారిని ఆదరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీవీ సూపర్వైజర్ హరి అధ్యాపకులు గంగిరెడ్డి సహదేవ రెడ్డి సుందరం కళ్యాణి విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సజావుగా పెన్షన్ల పంపిణీ

**- పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం ,డిసెంబర్ 01:** దిత్వా తుఫాన్ , ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, సోమవారం పెన్షన్ లను ఏపీ ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్టిఆర్ భరోసా పెన్షన్ పథకం కింద రూ4 వేలు పెన్షన్ అంది స్తోంది. రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి పెన్షన్ లబ్ధిదారులందరికీ... డిసెంబర్ 1 ఉదయం 7:00 గంటలకి పెన్షన్ అందిస్తున్న అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు గ్రామస్తులు, పెన్షన్ లబ్ధిదారులు. తదిపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )